GV MALL shop & celebrate TELANGANA | ANDHRAPRADESH | KARNATAKA



# ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్పోర్ట్స్ ఎడిషన్ Evening 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 109 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 +https:www.prajarepublic.com + వెల - 1/-

శనివారం 22 నవంబర్ 2024

RNI No: APTEL/2023/87888

Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


## 'మహా' ఎన్నికల ఫలితాలపై చంద్రబాబు హర్షం.. అమిత్‌కు ఫోన్

మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల పై ఏపీ సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు.

అమరావతి, నవంబర్ 23, (రిపబ్లిక్ న్యూస్): మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల పై ఏపీ సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఘన విజయం దిశగా దూసుకెళ్తున్న మహాయుతి కూటమికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్, మహారాష్ట్ర సీఎం ఏక్నాథ్ శిందే, డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడణవీస్కు ఆయన ఫోన్ చేశారు. ఎన్నికల్లో ప్రజలు అపూర్వ విజయం కట్టబెడుతున్నారంటూ శుభాకాంక్షలు చెప్పారు.



మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల్లో మహాయుతి కూటమి భారీ విజయం దిశగా వెళ్తోంది. ఇప్పటి వరకు వెల్లడైన ఫలితాల ప్రకారం ఆ కూటమి 215 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. ఎంవీఏ కూటమి కేవలం 60 స్థానాల్లోనే ముందంజలో ఉంది. మహాయుతి కూటమి అధికారంలోకి రావడం ఖాయం కావడంతో చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు.

## 'హష్ మనీ' కేసులో ట్రంపనకు భారీ ఊరట!

డొనాల్డ్ ట్రంప్ నకు సంబంధించిన హష్ మనీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది.

**నవంబర్ 23, (రిపబ్లిక్ న్యూస్):** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్‌నకు కేసుల విషయంలో భారీ ఊరట లభిస్తోంది. తాజాగా హష్ మనీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆ కేసుకు సంబంధించిన శిక్షను నిరవధికంగా వాయిదా వేశారు. 'ఈనెల 26న ఈ కేసును వాయిదా వేసేంతవరకు శిక్షపై స్టే కోసం ఉమ్మడి దరఖాస్తు మంజూరు చేయండి' అని న్యూయార్క్ జడ్జి జువాన్ మెర్చర్ తీర్పులో పేర్కొన్నారు.



'అధ్యక్షుడు ట్రంప్నకు నిర్ణయాత్మక విజయంతో బూటకపు హష్ మనీ కేసు పూర్తిగా నిలిచిపోయింది. శిక్ష వాయిదా పడింది, ట్రంప్ భారీ విజయాన్ని సాధించారు' అని ట్రంప్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ స్టీవెన్ చియుంగ్ తెలిపారు. హష్ మనీ కేసులో డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే దోషిగా తేలగా.. న్యూయార్క్ కోర్టు ఈనెలలో శిక్ష ఖరారు చేయాల్సిఉంది. ఇదే సమయంలో అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నిక కావడంతో ఆయన క్రిమినల్ విచారణ ఎదుర్కోకుండా రక్షణ ఉంటుందని సుప్రీంకోర్టు గతంలో చెప్పిన నేపథ్యంలో ఈ కేసును కొట్టివేయాలని ట్రంప్ తరపు న్యాయవాదులు కోర్టును ఆశ్రయించారు. శృంగార తార స్టార్మీ డానియల్స్ ట్రంప్ గతంలో ఏకాంతంగా గడిపారనే ఆరోపణలు ఉన్నాయి. 2016 అధ్యక్ష ఎన్నికల సమయంలో దీనిపై ఆమె నోరు విప్పకుండా ఉండేందుకు ట్రంప్ తన న్యాయవాది ద్వారా ఆమెకు 1.30 లక్షల డాలర్ల హష్మానీని ఇప్పించారన్నది ఆరోపణ. ప్రచార కార్యక్రమాల కోసం అందిన విరాళాల నుంచి ఆ మొత్తాన్ని ఖర్చు చేశారని, అందుకోసం రికార్డులన్నింటినీ తారుమారు చేశారన్నది ప్రధాన అభియోగం. ఇలా మొత్తం 34 అంశాల్లో ఆయనపై నేరారోపణలు నమోదయ్యాయి. ఆరు వారాల విచారణ అనంతరం ట్రంప్పై మోపిన అభియోగాలన్నీ నిజమేనని 12 మంది జడ్జీలతో కూడిన ధర్మాసనం ఏకాభిప్రాయంతో తీర్పు వెలువరించింది. ట్రంప్ తో ఏకాంతంగా గడిపిన మాట వాస్తవమేనని స్టార్మీ డానియల్స్ స్వయంగా కోర్టులో వాంగ్మూలం ఇచ్చారు. ఆమెతో సహా మొత్తం 22 మంది సాక్షులను కోర్టు విచారించింది. అయితే, దీనిపై ఈనెల 26న శిక్ష ఖరారు కావాల్సిఉండగా.. శిక్ష వాయిదా పడటం గమనార్హం.



## హైదరాబాద్ తాగునీటి అవసరాలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష


జలమండలి, ఇరిగేషన్ ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు.

**హైదరాబాద్, నవంబర్ 22, (రిపబ్లిక్ న్యూస్):** జలమండలి, ఇరిగేషన్ ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ తాగునీటి అవసరాలకు 20 టీఎంసీల గోదావరి జలాల తరలింపుపై అధికారులతో సమీక్షించారు. కొండపోచమ్మ, మల్లన్నసాగర్ నుంచి నీటి తరలింపుపై నివేదిక ఇవ్వాలని అధికారులను సీఎం ఆదేశించారు. నీటి తరలింపునకు అయ్యే వ్యయం, లభ్యతపై అధ్యయనం చేయాలని సూచించారు. డిసెంబరు 1లోపు టెండర్లకు వెళ్లేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. మిషన్ భగీరథ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సీఎం సూచించారు.

## చంద్రబాబుపై రాళ్ల దాడి కేసు.. పోలీసుల అదుపులో ముగ్గురు

వైకాపా హయాంలో అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత సీఎం చంద్రబాబు పై ఎన్టీఆర్ జిల్లా నందిగామలో జరిగిన రాళ్ల దాడి కేసులో పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు.

**నందిగామ, నవంబర్ 23, (రిపబ్లిక్ న్యూస్):** వైకాపా హయాంలో అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత సీఎం చంద్రబాబు పై ఎన్టీఆర్ జిల్లా నందిగామలో జరిగిన రాళ్ల దాడి కేసులో పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. 2022 నవంబర్ 5న చంద్రబాబు నందిగామలో పర్యటించారు. వాహనంపై అభివాదం చేస్తూ చంద్రబాబు వస్తుండగా వీధి లైట్లు ఆర్పివేసి రాళ్ల దాడి చేశారు. స్థానిక రైతు బజార్ వద్ద చందర్లపాడు రోడ్డులో ఈ ఘటన జరిగింది. ఇందులో చంద్రబాబు చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మధుసూదనరావుకు గాయాలయ్యాయి. దీనిపై




కేసు నమోదైనా వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. తాజాగా పోలీసులు ఈ కేసులో పురోగతి సాధించారు. నందిగామకు చెందిన కనికంటి సజ్జన్ రావు, బెజవాడ కార్తీక్, పరిమి కిశోర్లను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు.

## భద్రాద్రి రామయ్య ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం :మంత్రి పొంగులేటి

ఇందిరమ్మ రాజ్యంలో భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని అభివృద్ధి చేసి తీరతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.




**భద్రాచలం, నవంబర్ 23, (రిపబ్లిక్ న్యూస్):** ఇందిరమ్మ రాజ్యంలో భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని అభివృద్ధి చేసి తీరతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆలయ అభివృద్ధిపై అధికారులతో చర్చించారు. తొలుత ఆలయం వద్దకు వచ్చిన మంత్రికి మంగళ వాయిద్యాలు, పూలమాలలతో ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయంలోని సీతారామచంద్ర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మంత్రికి ఉపాలయంలోని లక్ష్మీ తాయారు అమ్మవారి ఆలయంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి ప్రసాదం, చిత్రపటాన్ని అందించారు. మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మంత్రితో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భద్రాచలంలోని ఏఎంసీ కాలనీలో గతంలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇళ్లను మంత్రి పరిశీలించారు. అక్కడ కాంట్రాక్టర్తో మాట్లాడారు. లెక్కల్లో చాలా తేడాలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తదుపరి పట్టణ శివారులోని ఓ ఫంక్షన్ హాలులో భద్రాచలం అభివృద్ధిపై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భద్రాద్రి ఆలయాన్ని అభివృద్ధి చేసే కార్యక్రమంలో భాగంగా మొదటి విడత రూ.68 కోట్లతో స్థల పరిశీలన పనులు త్వరలోనే మొదలు పెడతామన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో మరిన్ని నిధులను మంజూరు చేసి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి తెలిపారు.

## విద్యార్థినులతో అసభ్య ప్రవర్తన.. కీచక ఉపాధ్యాయుడికి దేహశుద్ధి

విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు దిగజారి ప్రవర్తించాడు. విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు.

**కాకినాడ, నవంబర్ 23, (రిపబ్లిక్ న్యూస్):** విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు దిగజారి ప్రవర్తించాడు. విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. విషయం తల్లిదండ్రులకు తెలియడంతో పాఠశాలకు చేరుకొని అతడికి దేహశుద్ధి చేశారు. ఈ ఘటన కాకినాడలోని జగన్నాథపురం నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో జరిగింది. గణితం బోధిస్తున్న శ్రీనివాసరావు తమ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడంటూ కొందరు విద్యార్థులు తమ తల్లిదండ్రులను పాఠశాలకు తీసుకొచ్చారు. ఈ క్రమంలో చిన్నపాటి గొడవ జరిగింది. దీంతో శ్రీనివాసరావు అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించాడు. అడ్డుకున్న విద్యార్థినుల తల్లిదండ్రులు అతడికి దేహశుద్ధి చేశారు.



సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఉపాధ్యాయుడిని పోలీస్ స్టేషన్కు తరలించారు. పాఠశాలలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

## హిందీ మహావిద్యాలయం అనుమతులు రద్దు

హిందీ మహావిద్యాలయం అనుమతులను ఉస్మానియా యూనివర్సిటీ రద్దు చేసింది.




**హైదరాబాద్, నవంబర్ 23, (రిపబ్లిక్ న్యూస్):** హిందీ మహావిద్యాలయం అనుమతులను ఉస్మానియా యూనివర్సిటీ రద్దు చేసింది. విద్యార్థుల మార్కుల జాబితాలో అక్రమాలు జరిగినట్లు ఓయూ విచారణ కమిటీ తేల్చడంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఓ ప్రైవేటు కళాశాలలో ఓయూ అధికారుల సంతకాలు ఫోర్జరీ జరిగినట్లు విచారణ కమిటీ ఇటీవల నిర్ధరించింది. ఈ మేరకు హిందీ మహావిద్యాలయం స్వయం ప్రతిపత్తిని రద్దు చేయాలని యూజీసీకి సిఫారసు చేసింది. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు కోర్సు పూర్తి చేసేందుకు ఓయూ అవకాశం కల్పించింది.

## వర్రా రవీందర్ రెడ్డిని ప్రొద్దుటూరు కోర్టులో హాజరుపరిచిన పోలీసులు

వర్రా రవీందర్ రెడ్డిని పోలీసులు ప్రొద్దుటూరు కోర్టులో ప్రవేశపెట్టారు.

**ప్రొద్దుటూరు, నవంబర్ 23, (రిపబ్లిక్ న్యూస్):** వర్రా రవీందర్రెడ్డిని పోలీసులు ప్రొద్దుటూరు కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రొద్దుటూరంలో నమోదైన కేసులో పీటీ వారెంట్పై ఆయన్ను కడప నుంచి తీసుకెళ్లి న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. వర్రా రవీందర్రెడ్డిపై వైఎస్సార్ జిల్లావ్యాప్తంగా 10 కేసులు నమోదయ్యాయి. సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరమైన పోస్టులు పెట్టడంతో రాష్ట్రవ్యాప్తంగా ఆయనపై 40 కేసులు నమోదయ్యాయి. వర్రా రవీందర్ రెడ్డి కేసులో నెల్లూరు, భీమవరానికి చెందిన ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకొని పోలీసులు విచారిస్తున్నారు. వైకాపా అధికారంలో ఉండగా వర్రా రవీంద్రారెడ్డి అడ్డూ అదుపూ లేకుండా మితిమీరి ప్రవర్తించారు. చంద్రబాబు, పవన్ కళ్యాన్, లోకేష్, అనితపై అసభ్యకరమైన పోస్టులు పెట్టారు. ఆయనపై మంగళగిరి, హైదరాబాద్‌లో పలు కేసులున్నాయి.





printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్



# చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1926: 20వ శతాబ్దంలో ప్రసిద్ధి చెందిన మతగురువు సత్య సాయి బాబా జననం (మ.2011).
- 1930: హిందీ చలన చిత్ర గీతాలు ఆలపించిన భారతీయ నేపథ్య గాయకురాలు గీతా దత్ జననం (మ.1972).
- 1937: ప్రముఖ వృక్ష శాస్త్రవేత్త, జగదీశ్ చంద్రబోస్ మరణం (జ.1858). (చిత్రంలో)
- 1967: దక్షిణ ఆఫ్రికా మాజీ క్రికెట్ ఆటగాడు గారీ క్రిస్టెన్ జననం.
- 1986: తెలుగు సినిమా నటుడు అక్కినేని నాగ చైతన్య జననం.
- 1971: 'పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా' (పి.ఆర్.ఒ) ప్రతినిధులు ఐక్యరాజ్యసమితి సమావేశాలకు తొలిసారిగా హాజరయ్యారు.
- 1997: ప్రసార భారతి చట్టం అమల్లోకి వచ్చింది.


సత్య సాయి బాబా


గీతా దత్


జగదీశ్ చంద్రబోస్


గారీ క్రిస్టెన్


నాగ చైతన్య


ఐక్యరాజ్యసమితి

ప్రసార భారతి

రిపబ్లిక్ స్పోర్ట్స్

# ఆ రియాక్షన్ సూపర్..
## అందుకే బుమ్రా స్పెషల్: ఆడమ్

బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో ఆసీస్తో తొలి టెస్టుకు జస్ప్రీత్ బుమ్రా సారథిగా వ్యవహరిస్తున్నాడు. ఆసీసు తొలి ఇన్నింగ్స్‌లో దెబ్బకొట్టడంలో బుమ్రానే కీలక పాత్ర పోషించాడు.




ఆస్ట్రేలియాతో తొలి టెస్టులో విరాట్ కోహ్లి చేతిలోకి వచ్చిన క్యాచ్ను చేజార్చాడు. కానీ, కెప్టెన్ కమ్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా ఏమాత్రం అసహనం వ్యక్తం చేయలేదు. లబుషేన్ వంటి డేంజరస్ బ్యాటర్ ను ఔట్ చేసే అవకాశం మిస్ అయినందుకు మరొకరైతే పెద్ద రాద్ధాంతమే చేసేవారు. కానీ, బుమ్రా మాత్రం ఒక్క మాట కూడా మాట్లాడకుండా తన బౌలింగ్కు వెళ్లిపోయాడు. అదే నిబద్ధతతో ఐదు వికెట్ల ప్రదర్శన చేసి ఆసీస్ ను దెబ్బకొట్టాడు. ఈక్రమంలో అతడి బౌలింగ్ తోపాటు కెప్టెన్సీపై ఆసీస్ మాజీ క్రికెటర్ ఆడమ్ గిల్ క్రిస్ట్ సంభ్రమాశ్చర్యానికి గురయ్యాడు. అతడు ప్రవర్తించిన తీరు తనను ఎంతో మెప్పించిందంటూ ప్రశంసల వర్షం కురిపించాడు. తొలి పది ఓవర్లలోనే ప్రత్యర్థిని కట్టడి చేసి తన జట్టును లీడ్లోకి తీసుకొవచ్చేందుకు ప్రయత్నిస్తాడని ఈసందర్భంగా గిల్క్రిస్ట్ తెలిపాడు. "బౌలరే కెప్టెన్. అతడు వేస్తున్న స్పెల్. అప్పటికే వికెట్ తీసిన ఉత్సాహంలో ఉన్నాడు. కీలక బ్యాటర్ను (లబుషేన్) ఔట్ చేసే అవకాశం వచ్చింది. స్లిప్లో విరాట్ కోహ్లి మంచి క్యాచర్. కానీ, అతడి చేతి నుంచి బంతి చేజారింది. ఆ సమయంలోనూ బుమ్రా రియాక్షన్ అద్భుతం. చిరునవ్వుతోనే ముందుకుసాగాడు. అదెలా ఉందంటే.. 'ఫర్వాలేదు. మరొక బంతితో ఔట్ చేస్తాలే' అన్నట్లుగా ఉంది. జట్టులోని ప్రతిఒక్కరూ అతడిలా పాజిటివ్ దృక్పథంతో ఉండటం బాగుంది. బుమ్రా బౌలింగు ఎదుర్కోవడానికి ఎంతటి బ్యాటరైనా బిక్కమొహం వేయాల్సిందే. ఏ క్షణంలోనూ పట్టు వదిలే ప్రసక్తే లేదన్నట్లుగా అతడి ప్రదర్శన ఆ స్థాయిలో ఉంది. వికెట్ కొద్దిలో చేజారినప్పటికీ అతడి బౌలింగ్ యాక్షన్, స్టైల్, టెక్నిక్స్లో ఎలాంటి మార్పులు లేవు. ఆ విషయంలో బుమ్రా బాగా నచ్చాడు. కేవలం బౌలర్గానే కాకుండా సారథ్యంలోనూ తన ప్రత్యేకతను బుమ్రా ప్రదర్శిస్తున్నాడు" అని ఆడమ్ గిల్ క్రిస్ట్ వెల్లడించాడు. తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్ భారత్ 150 పరుగులకు ఆలౌట్ కాగా.. ఆసీస్ 104 పరుగులకే కుప్పకూలింది. దీంతో 46 పరుగుల లీడ్తో టీమ్ ఇండియా రెండో ఇన్నింగ్సును కొనసాగిస్తోంది. ఆసీస్ బ్యాటర్లు ఉస్మాన్ ఖవాజా, మెక్స్వీనీ, స్టీవ్ స్మిత్, అలెక్స్ కేరీ, పాట్ కమిన్స్ వికెట్లను బుమ్రా పడగొట్టాడు.

# అలాంటి పాత్రలు ఎంచుకున్నందుకు విమర్శించారు: నిత్యా మేనన్

ఇఫ్ఫీ వేడుకలో నిత్యా మేనన్ పాల్గొన్నారు. పాత్రల ఎంపికలో ఉండే ప్రాముఖ్యతను వివరించారు.



గోవాలోని పణజీలో భారతీయ అంతర్జాతీయ సినిమా పండుగ (ఇఫ్ఫీ) వేడుకగా జరుగుతోన్న విషయం తెలిసిందే. ఈ వేడుకలో నటి నిత్యా మేనన్ పాల్గొని సినిమాల్లోని పాత్రల ఎంపిక గురించి తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. కొన్ని పాత్రలను ఎంపిక చేసుకున్నప్పుడు ఎదురయ్యే సవాళ్ల గురించి చర్చించారు. 'ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్లలో తేలికపాటి పాత్రలను ఎంచుకున్నందుకు విమర్శించారు. ఆ తర్వాత కథలను ఎంపిక చేసుకునే విధానాన్ని మార్చుకున్నా. నటన అనేది భావోద్వేగానికి సంబంధించింది. దానికి వ్యక్తిగత అనుభవం అవసరం లేదు. సినిమాలో తల్లి పాత్ర పోషించడానికి అనుభవం అవసరం లేదు. దానిలో ఉండే భావోద్వేగాన్ని తెరపై చూపగలిగితే చాలు. మనం చేసే పాత్రలపై మనకు పూర్తి విశ్వాసం ఉండాలి. ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే వాటిని ఎంచుకుంటే గుర్తింపు లభిస్తుంది. మనసు ఎప్పుడూ ప్రశాంతంగా ఉండేలా చూసుకోవాలి. లేదంటే ఆ ప్రభావం మనం పోషించే పాత్రపై పడుతుంది. గతంలో నేను ఎప్పుడూ విచారంగా ఉండేదాన్ని. ఏడ్చే సన్నివేశాల్లో సులభంగా నటించేదాన్ని. ఎమోషనల్ సీన్ లు తేలికగా చేసేదాన్ని. ఇప్పుడు అలాంటి సన్నివేశాలు చేయడం కొంచెం కష్టంగా మారింది. బహుశా నేనిప్పుడు చాలా ఆనందంగా ఉంటున్నానేమో' అని నిత్యా మేనన్ చెప్పారు. ఇటీవల జరిగిన 70వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో ఉత్తమ నటిగా నిత్యా పురస్కారాన్ని అందుకున్నారు. ధనుష్ హీరోగా నటించిన 'తిరు'(తిరుచిత్రంబళం)కు గాను ఆమె ఈ అవార్డును అందుకున్నారు. ప్రస్తుతం ఆమె పాండిరాజ్ దర్శకత్వంలో విజయ్ సేతుపతితో కలిసి ఓ సినిమా చేస్తున్నారు. అలాగే 'గోల్డెన్ వీసా'లోనూ నటిస్తున్నారు. దీనితో పాటు ధనుష్ సరసన 'ఇడ్లీకడై'లో చేస్తున్నారు. ధనుష్ స్వీయ దర్శకత్వంలో.. గ్రామీణ నేపథ్య కథతో ఇది

# ఏయన్నార్ బయోపిక్ బోర్ కొడుతుందేమో..: నాగార్జున

ఏయన్నార్ బయోపిక్ గురించి నాగార్జున ఇఫీ వేదికపై మాట్లాడారు. ఆ బయోపిక్ బోర్ కొడుతుందేమోనన్నారు.




ఏయన్నార్ బయోపిక్ గురించి అగ్ర కథానాయకుడు నాగార్జున మరోసారి మాట్లాడారు. గోవాలో ఘనంగా జరుగుతున్న ఇఫ్ఫీ వేడుకల్లో దివంగత నటుడు ఏయన్నార్కు నాగార్జున నివాళులర్పించారు. ఈసందర్భంగా శుక్రవారం 'సెంటినరీ స్పెషల్ ఏఎన్నార్: సెలబ్రేటింగ్ ది లైఫ్ అండ్ వర్క్స్ ఆఫ్ అక్కినేని నాగేశ్వరరావు' పేరుతో ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. అందులో ఈ బయోపిక్ గురించి మాట్లాడారు. 'ఏయన్నార్ బయోపిక్ గురించి ఎప్పుడూ చర్చ జరుగుతూనే ఉంటుంది. దాన్ని సినిమాగా కంటే డాక్యుమెంటరీగా తీస్తే బాగుంటుందని నా అభిప్రాయం. ఎందుకంటే ఆయన జీవితాన్ని సినిమాగా రూపొందించాలంటే చాలా కష్టం. ఆయన జీవితంలో ఎప్పుడూ వెనకడుగు వేయలేదు. ఎదుగుదల పెరుగుతూనే పోయింది. అలాంటి దాన్ని తెరపై చూపాలంటే బోర్ కొడుతుందేమో!. ఒడుదొడుకులు చూపిస్తేనే సినిమా బాగుంటుంది. అందుకే ఆయన జీవిత కథలో కొన్ని కల్పితాలు జోడించి డాక్యుమెంటరీగా రూపొందించాలి' అని అన్నారు. తాను నటిస్తోన్న చిత్రాల గురించి మాట్లాడుతూ.. 'కుబేర', 'కూలీ' సినిమాల్లో చేస్తున్నట్లు చెప్పారు. కూలీ దర్శకుడు లోకేశ్ కనగరాజ్ పై ప్రశంసలు కురిపించారు. లోకేశ్ ఈతరం వారికి కావాల్సిన విధంగా సినిమాలు తీయడంలో నేర్పరి అని ప్రశంసించారు. ఆయన ఫిల్మ్ మేకింగ్ కొత్తగా ఉంటుందన్నారు. సినిమా చేస్తున్నంతసేపు ఎంజాయ్ చేసినట్లు చెప్పారు. 'కుబేర, 'కూలీ' రెండూ విభిన్నమైన చిత్రాలని.. ప్రస్తుతం తన పాత్రల విషయంలో ప్రయోగాలు చేస్తున్నట్లు చెప్పారు.

రిపబ్లిక్ సినిమా CINEMA


# బర్త్ డే స్పెషల్.. కొత్త సినిమా ప్రకటించిన నాగచైతన్య

పుట్టినరోజు సందర్భంగా నాగచైతన్య కొత్త సినిమా ప్రకటించారు. ఎన్‌సి 24 ఇది రానుంది.



అక్కినేని నాగచైతన్య తన అభిమానులకు గుడ్ న్యూస్ చెప్పారు. నేడు ఆయన పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియాలో శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఈ స్పెషల్ డే నాడు చైతన్య కొత్త సినిమాను ప్రకటించారు. ఎన్‌సి24' పేరుతో ఇది రూపొందుతుంది. సుకుమార్ రైటింగ్స్ నుంచి ఈ చిత్రం రానుంది. కార్తిక్ దండు దర్శకత్వంలో ఇది తెరకెక్కనుంది. ఈవిషయాన్ని తెలుపుతూ నిర్మాణ సంస్థ పోస్టర్ను విడుదల చేసింది. విరూపాక్ష, కాంతార సినిమాలకు సంగీతం అందించిన లోకాంత్ 'ఎన్‌సి24'కు స్వరాలు అందిస్తున్నారు.

# 'పుష్ప2' నుంచి 'కిస్సిక్' సాంగ్ ప్రోమో రిలీజ్..



అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'పుష్ప2: ది రూల్. రష్మిక కథానాయిక. డిసెంబరు 5న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సినిమాలోని మాస్ సాంగ్ నవంబర్ 24న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ప్రోమో టీమ్ రిలీజ్ చేసింది. ఈ మాస్ ప్రోమోను మీరూ చూసేయండి.

అందం

# చలికి పెదాలు పగులుతున్నాయా..
## లిప్‌బామ్ బదులు వీటిని రాస్తే అందంగా మారతాయి

చలికాలం వస్తే చాలు పెదవులు పగిలిపోతాయి. గాలిలో తేమ తక్కువగా మారిపోవడం వల్ల ఈ సమస్య వస్తుంది. పగిలిన పెదాలను కొరకడం వల్ల ప్రాబ్లమ్ మరింత పెద్దగా మారుతుంది. ఈ సమస్యకి చెక్ పెట్టాలంటే కొన్ని టిప్స్ వాడాలి.

చలికాలంలో బ్యూటీకి సంబంధించిన సమస్యలు ఎక్కువగా వస్తాయి. అందులో పెదవులు పగిలిపోవడం ఒకటి. ఈ సమస్యని తగ్గించేందుకు చాలా మంది పదే పదే లిప్‌బామ్ రాస్తుంటారు. దీని వల్ల టెంపరరీగా బాగున్నప్పటికీ తిరిగి మళ్ళీ సమస్య మొదటికే వస్తుంది. అలా కాకుండా సమస్యని మూలాల నుంచి దూరం చేసి పెదాలు అందంగా, కోమలంగా మారాలంటే కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. దీంతో పెదాలు మాయిశ్చర్‌గా అందంగా మెరుస్తూ కనిపిస్తాయి. పైగా ఈ టిప్స్ ఫాలో అవ్వడం పెద్ద ఖర్చు కూడా కాదు. ఇవన్నీ కూడా ఇంట్లోనే ఉంటాయి. వీటిని వాడడం వల్ల పెదాలు అందంగా, కోమలంగా మారతాయి. అవేంటో తెలుసుకోండి.



### దోస..



దోసలో నీటిశాతం ఎక్కువగా ఉంటుంది. ఈ దోసలో యాంటీ ఆక్సిడెంట్స్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఎక్కువగా ఉంటాయి. ఇవన్నీ కూడా పెదాలను అందంగా కోమలంగా మారుస్తాయి. అందంగా కనిపించేలా చేస్తాయి.

### కొబ్బరినూనె..



కొబ్బరినూనెలో గొప్ప గుణాలు ఉన్నాయి. ఇవన్నీ కూడా అందాన్ని పెంచడంలో హెల్ప్ చేస్తాయి. కొబ్బరినూనెలోని గుణాలు పెదాలను మాయిశ్చర్ చేసి మృదువుగా మారుస్తాయి. దీనికోసం కొబ్బరినూనెని తీసుకుని పెదాలపై కొద్దిగా రాసి అప్లై చేయాలి. దీంతో పెదాల పగుళ్లు తగ్గడమే కాకుండా అవి కోమలంగా మారతాయి.

### తేనె..



తేనెలో యాంటీ ఆక్సిడెంట్స్, యాంటీ బ్యాక్టీరియాల్ గుణాలు ఉన్నాయి. ఇవన్నీ కూడా డ్రై అయిన పెదాలను మాయిశ్చర్ చేసి అందంగా కోమలంగా చేస్తాయి. పైగా ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. పైగా ఈ తేనెని రాత్రుళ్ళు అప్లై చేసి ఉదయాన్నే క్లీన్ చేసుకోవాలి. దీని వల్ల పెదాలు అందంగా మెరుస్తూ ఉంటాయి.

### షియా బటర్..



షియా బటర్‌లో కూడా రిచ్ విటమిన్స్, ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఇవన్నీ పెదాలను సాఫ్ట్‌గా చేస్తాయి. హైడ్రేట్‌గా చేస్తాయి. దీనికోసం రెగ్యులర్‌గా షియా బటర్‌ని పెదాలపై రాసి మసాజ్ చేయాలి.

### పెట్రోలియం జెల్లీ..



ఫ్రాగ్రెన్స్ ఫ్రీ పెట్రోలియం జెల్లీ కూడా పెదాలని కోమలంగా మార్చడంలో హెల్ప్ చేస్తాయి. దీనిని రాయడం వల్ల పెదవులు ఎప్పటికీ హైడ్రేట్‌గా ఉంటాయి. పగుళ్ళు, ఇరిటేషన్ వంటి సమస్యలు దూరమవుతాయి. కాబట్టి, కొద్దిగా వాజిలేన్ తీసుకుని పెదాలకి రాయాలి. తర్వాత మసాజ్ చేస్తే పెదవులు మాయిశ్చర్ అవుతాయి. కోమలంగా మారతాయి.

### వీటితో పాటు..

- గాలిలో తేమ కారణంగా పెదవులు డ్రైగా మారతాయి. అలా కాకుండా ఉండాలంటే మీరు పడుకునేటప్పుడు హ్యుమిడీఫైయర్‌ని వాడండి.
- అదే విధంగా, రోజూ ఎక్కువగా నీరు తాగండి. దీని వల్ల కూడా బాడీ హైడ్రేట్‌గా ఉంటుంది. పెదాలు కూడా ఆరిపోకుండా ఉంటాయి.
- దీంతో పాటు ఒమేగా 3 ఫ్యాటీ యిసిడ్స్ ఎక్కువగా చేపల్ని తినడం వల్ల కూడా స్కిన్, లిప్స్ డ్రైగా మారకుండా ఉంటాయి.
- పెదాలను తడమడం, నాకడం వంటి పనులు చేయొద్దు. దీని వల్ల పెదాలు పగలకుండా ఉంటాయి.



గమనిక: నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.